ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 27.0
కనిష్ఠం 15.4

ANDHRAJYOTHY

సూర్యాపేట

5

బుధవారం 10 డిసెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	576.80 (273.8166)	20,167	20,167
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.64 (4.37)	456.82	333.24
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.554 (43.5481)	900	4,400

చికెన్ ధరలు | లైవ్ : రూ.165 | డ్రెస్ : రూ.246 | స్కిన్‌లెస్ : రూ.270

మొదటి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధం



మద్దిరాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఈనెల 11న మొదటి విడత పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధంచేశారు. మంగళవారంతో ప్రచారం ముగియడంతో గ్రామాల్లో హడావిడి ముగిసింది. పోలింగ్‌కు అవసరమైన ఎన్నికల సామగ్రిని అధికారులు సిద్ధం చేశారు. పోలింగ్‌కు సంబంధించిన కేటాయించిన గ్రామాలకు అధికారులు, సిబ్బంది నేడు సామాగ్రితో తరలివెళ్లనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట (కలెక్టరేట్)

జిల్లాలో 486 గ్రామపంచాయతీలు, 4,388 వార్డులు ఉండగా మొదటి విడతలో ఎనిమిది మండలాల్లోని 159 గ్రామాల్లో 1,442 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం 4403 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏడుగురు సర్పంచ్ స్థానాలు, 198 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. అంతేకాకుండా మూడు వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదు. దీంతో 152 సర్పంచ్‌లు, 1241 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. సర్పంచ్ అభ్యర్థులుగా 478 మంది, వార్డుమెంబర్లకు 3,027 మంది పోటీలో ఉన్నారు. ఇదిలా ఉండగా మొదటి విడత పరిధిలోని ఎనిమిది మండలాల పరిధిలో మొత్తం 2,31,851మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,15,141 మంది పురుషులు, 1,16,705 మంది మహిళలు, ఇతరులు ఐదుగురు ఓటర్లు ఉన్నారు.

అన్నీ సిద్ధం చేసిన అధికారులు

మొదటి విడత పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. 152 సర్పంచ్ స్థానాలతో పాటు 1,241 వార్డులకు పోలింగ్ నేపథ్యంలో బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. మొత్తం 1,241 బ్యాలెట్ బాక్సులు అవసరం కాగా 1,440 సిద్ధంగా ఉంచారు. అదేవిధంగా ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ అధికారులు, సిబ్బందిని కేటాయించారు. అందులో 1,250 మంది పీవోలు, 1,400మంది ఓపీవోలతో పాటు 28 మంది జోనల్ అధికారులు, రూట్ ఆఫీసర్స్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్‌కాస్టింగ్ నిర్వహించేందుకు మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ఓటర్లకు పోలింగ్ రోజున గులాబీ రంగు కలిగిన బ్యాలెట్‌ను సర్పంచ్ అభ్యర్థులకు, తెల్లరంగు కలిగిన బ్యాలెట్‌ను వార్డు మెంబర్లకు కేటాయించారు.

నేడు పోలింగ్ కేంద్రాలకు తరలనున్న పోలింగ్ సిబ్బంది

సామాగ్రిని సిద్ధం చేసిన అధికారులు

ఏడు సర్పంచ్‌లు ఏకగ్రీవం

మొదటి విడతలోని ఎనిమిది మండలాల పరిధిలో ఏడు సర్పంచ్‌లు, 198 మంది వార్డులు సభ్యులు ఏకగ్రీవమయ్యాయి. అందులో సూర్యాపేట మండలం దుబ్బతండా, తిరుమలగిరి మండలంలో సిద్ధిసముద్రంతండా, మొండికుంటతండా, రాజ్యానాయక్‌తండా, కోక్యానాయక్‌తండా, మద్దిరాల మండలంలో గుట్టకిందతండా, తుంగతుర్తి మండలంలోని తూర్పుగూడెం గ్రామాల సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు ఆత్మకూరు(ఎస్) మండలంలో 59మంది వార్డు సభ్యులు, అర్వపల్లి మండలంలో 17 మంది, మద్దిరాల మండలంలో 12 మంది, నాగారం మండలంలో నలుగురు, నూతన్‌కల్ మండలంలో ఏడుగురు, సూర్యాపేట మండలంలో 42 మంది, తిరుమలగిరి మండలంలో 37 మంది, తుంగతుర్తి మండలంలో 20 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు.

నేడు పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది

మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామాలకు పోలింగ్ సిబ్బంది నేడు తరలివెళ్లనున్నారు...

- మిగతా 8వ పేజీలో...

మూడో విడతలో అభ్యర్థులు ఖరారు

ఏకగ్రీవమైన 22 సర్పంచ్‌లు, 179 వార్డు స్థానాలు

సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 17న నిర్వహించే మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు సం బంధించి నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. చివరి రోజు మంగళవారం పలువురు పోటీ నుంచి తప్పుకున్నారు. దీంతో బరిలో నిలి చే అభ్యర్థులు ఖరారయ్యారు. వీరికి అధికారులు గుర్తులు కేటాయించారు. వీరు ఇక ప్రచారం ప్రారంభించనున్నారు. ఏడు మండలాల్లోని 146 గ్రామాలకు సర్పంచ్ అభ్యర్థులుగా 769 మంది, 1,318 వార్డులకు 3,316 మంది నామినేషన్లు చెల్లుబాటు కాగా సర్పంచ్ అభ్యర్థులు 476 మంది ఉపసంహరించుకోగా 22 గ్రామాల సర్పంచ్‌లు ఏకగ్రీవ మయ్యారు. దీంతో 124 సర్పంచ్‌ల స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 124 గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులుగా 293 మంది పోటీలో ఉన్నా రు. 1,318 వార్డులకు 3,316 నామినేషన్లు చెల్లుబాటు కాగా 1318 వార్డులకు 179 వార్డులు ఏకగ్రీవం కాగా 1,139 వార్డులకు 2,224 మంది పోటీలో ఉన్నారు.

ఏకగ్రీవమైన గ్రామాలు

మూడో విడతకు సంబంధించి 22 గ్రామాల సర్పంచ్‌లు ఏకగ్రీవమయ్యాయి. అందులో హుజూర్‌నగర్ మండలంలో అంజలిపురం, గరిడేపల్లి మండలంలో ఎనిమిది గ్రామాల సర్పంచ్‌లు ఏకగ్రీవమయ్యాయి. అబ్బిరెడ్డిగూడెం, మంగాపురం, మర్రికుంట, కాల్వపల్లి, రాయిగూడెం, లక్ష్మీపురం, కోదండరాంపురం, వెంకట్రాంపురం గ్రామాల సర్పంచ్‌లు ఏకగ్రీవమయ్యారు. అదేవిధంగా మఠంపల్లి మండలంలో క్రిష్ణతండ, మట్టపల్లి, బాడవతండా, నేరేడుచర్ల మండలంలో పులగంబండతండా, బూర్గులతండా, ఫత్తేపురం గ్రామాల సర్పంచ్‌లు ఏకగ్రీవమయ్యారు. పాలకవీడు మండలంలో గుడుగుంట్లపాలెం, మీగడంపాటుతండా, హనుమయ్యగూడెం, మేళ్లచెర్వు మండలంలో కందిబండ, వెంకట్రాపురం, మంగలికుంటతండా సర్పంచ్‌లు ఏకగ్రీవమయ్యారు. చింతలపాలెం మండలంలో శోభనాద్రిగూడెం సర్పంచ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా హుజూర్‌నగర్ మండలంలో 8 వార్డులు, గరిడేపల్లి మండలంలో 68, మేళ్లచెర్వు మండలంలో 24, చింతలపాలెం మండలంలో 8, మఠంపల్లి మండలంలో 26, నేరేడుచర్ల మండలంలో 17, పాలకవీడు మండలంలో 28 వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

సమస్యాత్మక గ్రామాల్లో

ప్రత్యేక నిఘా

» ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు » సుమారు 1500 మంది పోలీసులు

మొదటి విడత ఎన్నికలకు సమ స్యాత్మక గ్రామాల్లో ఎస్పీ కొత్తపల్లి నరసింహ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఐ దెంచెల పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేటక్రైం)

గ్రామ పంచాయితీ ఎన్నికలకు సంబంధించి ఎస్పీ జిల్లాలో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఎన్ని జిల్లాలు ఉన్నాయో ఆ సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. కోదాడ మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద, చింతలపాలెం మండలంలోని దొండపాడు, మఠంపల్లి మండలంలోని మట్టపల్లి, తిరుమలగిరి, మద్దిరాల మండలంలో కుంటపల్లి, మోతె మండలంలో మామిళ్లగూడెం, సూర్యాపేట మండలంలో టేకుమట్ల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల పాటు తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతాల్లో ఎన్నికల సందర్భంగా మద్యం, నగదు రాకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

170 సమస్యాత్మక గ్రామాల గుర్తింపు

జిల్లాలోని 486 గ్రామ పంచాయితీల్లో 170 సమస్యాత్మక గ్రామాలు ఉన్నట్లు గుర్తించారు. మొదటి విడత ఎన్నికలు జరిగే 152 గ్రామాలకు 47 సమస్యాత్మక గ్రామాలు ఉన్నట్లు గుర్తించారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వారితో పాటు గతంలో కేసులు నమోదైన వారిని మళ్లీ ఎ లాంటి నేరాలకు పా ల్పడకుండా ముందస్తుగా రెండు లక్షల నుంచి ఐదు లక్షల వరకు పూచీకత్తుతో బైండోవర్ చేయించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1,284 మందిని బైండోవర్ చేశారు.

68 ప్రత్యేక తనిఖీ బృందాలు.

ఎన్నికలకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు 68 ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. అందులో నాలుగు స్పెషల్ సెక్యూరిటీ....

- మిగతా 8వ పేజీలో...

ఎన్నికల దృష్ట్యా

రెండు రోజులు సెలవులు

సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజు ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల పరిధిలో పాఠశాలలకు స్థానిక సెలవుదినంగా ప్రకటించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్‌నందలాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల పరిధిలో ఈ నెల 10, 11న, అలాగే రెండో విడత ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల పరిధిలో ఈ నెల 13, 14న, మూడో విడత ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల పరిధిలో ఈ నెల 16, 17 తేదీల్లో స్థానిక సెలవుదినంగా ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు వినియోగించుకునే ప్రభుత్వ సంస్థలు, గ్రామపంచాయతీ ఎన్నికలలో ఓటు హ క్కు వినియోగించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, పబ్లిక్ అండర్ టేకింగ్ సంస్థలలో పనిచేసే ఉద్యోగులు వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు స్థానిక సెలవును ప్రకటించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సెలవు ట్రెజరీలు, సబ్ ట్రెజరీలకు మాత్రం వర్తించవని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ



కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం విగ్రహం వద్ద జయ జయహే తెలంగాణ గేయాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు

సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా ఉద్యోగులు, మెప్మా మహిళలు, ఆశ వర్కర్లు, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జయ జయహే తెలంగాణ గేయాన్ని ఆలపించారు.

ఎన్నికల ఖర్చుపై అభ్యర్థులకు అవగాహన

ఆత్మకూర్(ఎస్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసిన సర్పంచ్, వార్డు సభ్యులు ఎన్నికల కోసం చేసే ఖర్చులను నిబంధనల ప్రకారం వెచ్చించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు మంగళవారం ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క అభ్యర్థి చేసే ఖర్చుల లెక్కలు చూపించాలని తెలిపారు. ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థి చేసిన ఖర్చుల లెక్కలు ఎన్నిక తర్వాత 45 రోజుల్లో చూపించాలలన్నారు. 45 రోజుల్లో లెక్కలు చూపించని వారిపై ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కింద చర్యలు తీసుకొనున్నట్లు తెలిపారు.

పోలింగ్ ప్రాంతాల్లో వైన్స్‌లు బంద్

ఆత్మకూర్(ఎస్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బాగంగా ఆత్మకూర్(ఎస్)లో మొదటి విడత ఎన్నికలు ఈ నెల 11వ తేదీన జరుగనుండడంతో ఎక్సైజ్ అధికారులు మంగళవారం పలు వైన్స్ దుకాణాలను సీజ్ చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగనుండగా దానికి రెండు రోజుల ముందుగానే వైన్స్‌లను మూసివేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మల్లేష్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వైన్స్ దుకాణాలు బంద్ చేస్తున్నామని తెలిపారు.

ఓటర్లకు చికెన్, కోడిగుడ్లు

పెన్‌పహాడ్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పెన్‌పహాడ్ మండలంలో రెండో విడతలో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. భారీ ర్యాలీలు తీసే గ్రామాల్లో కోలాటం వేసే ఒక్కొక్క మహిళలకు రూ.300, జెండా మోసే ప్రతీ వ్యక్తికి రూ.200, రూ.90 మద్యం కోసం ఇస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి అర కిలో నుంచి కిలో వరకు చికెన్, కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారు. సర్పంచ్, వార్డు అభ్యర్థులు తమ అనుచరులతో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్నారు. దీంతో మండలంలోని 29 పంచాయతీల్లో జనసందడి పెరిగింది. ఆయా గ్రామాల్లోని కొంత మంది ఓటర్లు సాయంత్రం కాగానే అభ్యర్థుల ఇంటి వద్దకు చేరుకుని మద్యం కావాలని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. అభ్యర్థులు మాత్రం ఓట్లు జారి పోవద్దని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాగా అభ్యర్థులు ఖర్చుకు వెనుకాడటం లేదని ఓటర్లు చెబుతున్నారు.

మొదటి విడత ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణి కుముదిని,పాల్గొన్న కలెక్టర్ అధికారులు



సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 11న మొదటి విడత ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణి కుముదని అన్నారు. మంగళవారం హైద్రాబాద్ నుండి జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు, కలెక్టర్, ఎస్పీతో పాటు ఇతర అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన బృందాలను నియమించుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్ నిర్వహించాలన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం తెలపాలన్నారు. అదే విధంగా ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మిగిలిన రెండో, మూడో విడత ఎన్నికల ప్రచారాల ముగింపు, మద్య నిషేధం పట్ల ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఓటర్లు ఓటు వేసేందుకు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన 18 కార్డుల్లో ఏదైనా ఒక దానిని చూపిస్తే ఓటు వేసే అవకాశం ఇవ్వాలన్నారు. అనంతరం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు గుగులోత్ రవినాయక్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికే పోలింగ్ సామాగ్రిని సిద్ధం చేశామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ మొదటి విడతలో 8 మండలాల పరిధిలోని 152 గ్రామాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సామాగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు పంపించడం జరిగిందన్నారు. పోలింగ్ సిబ్బంది, పోలింగ్ సామాగ్రిని గ్రామాలకు తరలించేందుకు అవసరమైన వాహనాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేశామని, అదే విధంగా మైక్రో అబ్జర్వర్లు వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తారన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఓట్లను లెక్కించి ఫలితాలు ప్రకటించి అనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ మాట్లాడుతూ మొదటి విడత ఎన్నికలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు ఐదెంచల పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు జరిగే గ్రామాల్లో నిరంతరం పెట్రోలింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సీతారామారావు, జిల్లా వ్యయ పరిశీలకులు హుస్సేన్, డీపీవో యాదగిరి, జడ్పీ సీఈవో అప్పారావు, ఈఎస్ లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి:కలెక్టర్

సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీ ఎన్నికల్లో భాగంగా రెండో, మూడో విడత ఎన్నికల విధులకు నియమించబడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత ఎన్నికలు జరిగే పెన్‌పహాడ్, చివ్వెంల, మోతె, మునగాల, నడిగూడెం, కోదాడ, అనంతగిరి, చిలుకూరు మండలాల పరిధిలో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు ఈనెల 10వ తేదీ వరకు ఆయా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలన్నారు. అదే విధంగా మూడో విడత ఎన్నికలు జరిగే హుజూర్‌నగర్, చింతలపాలెం, మేళ్లచెర్వు, గరిడేపల్లి, మఠంపల్లి, నేరేడుచర్ల, పాలకీడు మండలాల పరిధిలో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు ఈనెల 10, 12, 13, 15వ తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

హనుమాన్‌కి విశేష పూజలు



నేరుడుచర్లలో పూజల్లో పాల్గొన్న భక్తులు

నేరేడుచర్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నేరేడుచర్ల కోదండ రామాలయం ప్రాంగణంలోని ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు బృందావనం శ్రీరామనర్సింహతేజ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదారతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, ఆలయ ధర్మకర్త రాచకొండ నాగమాధవరావు, పులిజాల వెంకటరమణారావు, పూర్ణచంద్రారెడ్డి, జంగారావు, సైదయ్య, వెంకన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్ రూరల్, : మండలంలోని బూరుగడ్డ గ్రామంలో గల వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని క్షేత్ర పాలకుడు శ్రీఅభయాంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు, తమలపాకుల పూజ, గంధ సింధూరం, వడపప్పు, పానకం, నారికేళం, పులిహోర, వడమాలతో ప్రసాదాలు నివేదించారు. కార్యక్రమంలో లాల్‌సింగ్ సంధ్య, లింగబాబు, సత్యావతి, ఎంపీపీ గూడెపు శ్రీనివాసు, సీతమ్మ, అశోక్, అనిల్, ఉష, ఈఓ లక్ష్మణ్‌రావు, శ్రీనివాసాచార్యులు, కిరణ్, వీరస్వామి, సత్యనారాయణ, రమేష్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వకు బీఎన్‌రెడ్డి పేరు పెట్టాలి



మాట్లాడుతున్న మనం సుదాకర్

సూర్యాపేటఅర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఎస్సారెస్పీ రెండో దశకు భీంరెడ్డినర్సింహారెడ్డి పేరు పెట్టాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మనం సుధాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మశాలీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఎంసీపీఐయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం పాలనలో వెట్టిచాకిరి నిర్మూలనలో బీఎన్ రెడ్డి పాత్ర కీలకమైందన్నారు. దున్నేవాడికే భూమి పంచి గ్రామ స్వరాజ్య పాలనకు బాటలు వేశారని తెలిపారు. అలాంటి చరిత్ర గలిగిన పోరాట యోదుడుని ప్రస్తుత పాలకులు విస్మరించడం సరికాదన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో బీఎన్ చరిత్రను కనుమరుగు చేసే దిశగా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి మాట్లాడుతూ దొరల పాలన విముక్తికోసం తుపాకీ పట్టిన బీఎన్ ప్రజల సమస్యల కోసం చట్టసభల్లో మైకుపట్టిన చరిత్ర బీఎన్‌రెడ్డిదని గుర్తుచేశారు. ప్రభుత్వాలు కమ్యూనిస్టు యోదుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎవరి ఒత్తిడికి లొంగకుండ బీఎన్‌రెడ్డి చరిత్రను భావితరాలకు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, షేక్‌నజీర్, దంతాల రాంబాబు, గొడ్డలి నర్సయ్య, వై. వెంకటేశ్వర్లు, వెంకట్‌యాదవ్, భయ్య మల్లికార్జున్, బొమ్మిడి లక్ష్మీనారాయ ణ, బుద్దసత్యనారాయణ, చినపంగి నర్స య్య, బూరరాములు, ఏపూరి సోమయ్య, నక్క శ్రీనివాస్, రమేష్, కోటయ్య, ఉగ్రయ్య పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ

మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్



సూర్యాపేటలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లింగయ్యయాదవ్

సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి) కేసీఆర్ దీక్షతోనే అప్పటి కేంద్ర ప్రభుత్వం తలొగ్గి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిందని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. తెలంగాణ ఏర్పాటు చేస్తూ ప్రకటన చేసిన డిసెంబరు 9వ తేదీన కావడంతో పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని తెలంగాణ తల్లి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణకు నీళ్ల, నిధులు, నియామకాల విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని తట్టుకోలేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి శాంతియుతంగా ఉద్యమం చేశారన్నారు. కేసీఆర్ చచ్చుడో, తెలంగాణ వచ్చుడో అంటూ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆమరణ దీక్ష చేపట్టినట్లు వివరించారు. కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిన చరిత్ర కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తాను రూపొందించిన రాజ్యాంగంలో కూడా చిన్న రాష్ట్రాలతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపినట్లు పేర్కొన్నారు. సాగునీటి విషయంలో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించి నాటి బీడు భూములను సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. సమావవేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, నాయకులు పుట్టా కిషోర్‌కుమార్, సవరాల సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, మొరిశెట్టి శ్రీనివాసులు, ఆకుల లవకుశ, తాహేర్‌పాష, సయ్యద్ సలీం, బండారు రాజా, సాల్మా, మొహినుద్దీన్, సాగర్‌రెడ్డి, గాలి సాయి, పల్సా వెంకన్న, అంజమ్మ, పావని, చింటు, రఫీ, శ్రీనివాస్, రేణుబాబు, కరుణశ్రీ, లక్ష్మీకాంత్, భావ్‌సింగ్, సయ్యద్, బత్తుల రమేష్, అజీజ్, కాల్‌రాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యమైన ఆలోచన.. ప్రజాస్వామ్యానికి రక్షణ



(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)

వైకల్యం ఓటు హక్కు వినియోగానికి అడ్డుకాదని సూర్యాపేట జిల్లా మఠంపల్లి లోని దివ్యాంగులు నిరూపిస్తున్నారు. శారీరకంగా, మానసికంగా బాగుండి చదువుకుని సమాజం గురించి అవగాహన ఉన్న వారే చాలామంది పోలింగ్ రోజు ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితులను చూస్తున్నాం. శారీరక వైకల్యం ఉన్న దివ్యాంగులు మాత్రం ప్రతీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఓటుహక్కు అనేది ప్రజాస్వామిక దేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కు అని అందుబాటులో ఉండి అవకాశాలు ఉండీ వినియోగించుకోలేకపోతే మనిషి జీవచ్ఛవంతో సమానమని వారు పేర్కొంటున్నారు. పార్టీలు, వ్యక్తులపై ఎవరి వ్యక్తిగత అభిప్రాయం, అభిమానం ఎలా ఉన్నా ఓటు విషయానికి వచ్చే సరికి అన్నివర్గాల ప్రజలకు ఏం ప్రయోజనం ఒనగూరుతుందన్న సమదృష్టిలో ఉండాలని పేర్కొంటున్నారు. ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకోవాలంటున్నారు. సమాజ శ్రేయస్సుకు ఉపయోగ పడే వారిని గుర్తించి ఓటుహక్కును వినియోగించుకుంటే రాజ్యాంగం కల్పించిన హక్కుకు సార్థకత కలుగుతుందని వారు చెబుతున్నారు.

క్రమం తప్పకుండా ఓటు వేస్తున్నా



మఠంపల్లి సబ్‌స్టేషన్‌లో పనిచేసే సమయంలో విద్యుదాఘాతంతో నడుం కింది భాగం చలనం లేకుండాపోయింది. మరొకరి సాయం లేనిది అడుగు వేయలేను. 20 ఏళ్లుగా అన్ని స్థాయిల్లోని ఎన్నికల్లోనూ క్రమం తప్పకుండా ఓటేస్తున్నా. నా వయస్సు 48 సంవత్సరాలు ఓటు హక్కు వచ్చిన నాటి నుంచి ప్రమాదానికి ముందు మూడుసార్లు అనంతరం ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నా.

- గాయం గోవర్ధన్‌రెడ్డి, దివ్యాంగుల సంఘం జిల్లా నాయకుడు మఠంపల్లి

ప్రతీ ఎన్నికలో ఓటు వేశా



నా వయస్సు 42 ఏళ్లు. ఐదేళ్ల వయస్సు ఉన్నప్పుడు పోలియో కారణంగా వైకల్యం ఏర్పడింది. 18 ఏళ్ల దాటిన తర్వాత ఓటు హక్కు వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతీ ఎన్నికలో నా ఓటు హక్కును వినియోగించుకున్నా. బతుకులను మార్చగలిగే శక్తి ఓటుకు మాత్రమే ఉందని అందరూ గుర్తించాలి.

- అమరారపు సైదులు, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడు

పోలియో బాధితుడినైనా రాజీపడలేదు



నేను పట్టుకతోనే పోలియో బారినపడ్డా. బీఈడీ చదివిన నేను క్రమం తప్పకుండా ఓటు వేస్తున్నా. ఎక్కడా ఓటు విషయంలో రాజీ పడలేదు. ఎన్ని పనులు ఉన్నా పోలింగ్ రోజు ఓటు వేసేందుకు వెళ్తా. రాజ్యాంగం కల్పించిన హక్కును సరిగ్గా వినియోగిస్తేనే ప్రజాస్వామ్యం నిలబడుతుంది.

- గాలి సతీష్

అరచేతిలో ప్రచార అస్త్రం

- కాలం చెల్లిన గోడ రాతలు, బ్యానర్లు
- సోషల్ మీడియాకు పెరిగిన ప్రాధాన్యం
- ఎవరికి వారు వేర్వేరుగా వాట్సాప్ గ్రూపులు
- పంచాయతీ ఎన్నికల్లో 'మొబైల్ ఫోన్' కీలకపాత్ర

(ఆంధ్రజ్యోతి-నిడమనూరు): ఒకప్పుడు ఎన్నికలు వచ్చాయంటే తెల్లటి గోడలు అభ్యర్థుల పేర్లు, గుర్తులు, నినాదాలతో నిండిపోయేవి. క్రమంగా ఆ పద్ధతి కనుమరుగైంది. ఆ తర్వాత బ్యానర్లు వచ్చాయి. తెల్లటి వస్త్రాలపై నీలిరంగుతో రాసిన బ్యానర్లను వీధుల్లో, ప్రధాన కూడళ్లలో కట్టేవారు. ఆ తర్వాత అభ్యర్థుల చిత్రాలు, గుర్తులతో స్టిక్కర్లు, కరపత్రాలు, ఫ్లెక్సీలు వచ్చాయి. ఇంటింటికి వెళ్లి తలుపులు, గోడలపై స్టిక్కర్లు అతికించేవారు. ఆ పద్ధతి కొంతమేరకు ఇప్పటికీ కొనసాగుతున్నా, ప్రస్తుతం సాంకేతిక రంగం కొత్త పుంతలు తొక్కుతుండటంతో సోషల్ మీడియాకు ప్రాధాన్యం పెరిగింది. వాట్సాప్‌తో పాటు ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటితో ప్రతీ సమాచారాన్ని క్షణాల్లో చాలామందికి ఒక్క క్లిక్‌తో చేరవేస్తున్నారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ ఎన్నికల్లో సోషల్ మీడియానే ట్రెండింగ్ అవుతోంది. అందరి వద్ద సెల్‌ఫోన్లు ఉండటంతో అది అభ్యర్థులకు ప్రచారఅస్త్రంగా మారింది. దీంతో సోషల్‌మీడియా వేదికగా ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఇందుకోసం పార్టీలు, అభ్యర్థులు ప్రత్యేక వాట్సాప్‌గ్రూపులను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో గ్రామాలకు సంబంధించిన వాట్సాప్ గ్రూపులు అనేకం రూపొందాయి. ఫ్రెండ్స్, యూత్, క్లాస్‌మేట్స్, గ్రామస్థులు ఇలా అనేక పేర్లతో గ్రూపులు ఏర్పాటు చేసుకున్నారు. సోషల్ మీడియాలో తమకు సంబంధించిన ప్రచారాన్ని నిర్వహించేందుకు కొందరు కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో గ్రూపులో నాలుగైదు వందలమంది వరకు ఉంటారు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునేవరకు సామాజిక మాధ్యమాలనే ప్రచారానికి వాడుకుంటున్నారు. గ్రామానికి చెందిన ఓటర్లు స్థానికంగా ఉన్నా, ఇతర ఊర్లలో ఉన్నా ప్రచార సమాచారం వాట్సాప్ గ్రూపుల ద్వారా వారికి చేరుతుంది. ఓటర్ల ఫోన్ నెంబర్లు తీసుకొని మరీ వారికి సమాచారం అందిస్తున్నారు. తమను గెలిపిస్తే గ్రామానికి చేసే మంచి పనులు వివరించడంతో పాటు ప్రచార కార్యక్రమాలను సైతం వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడుతూ ఎప్పటికప్పుడు సమాచారం చేర వేస్తున్నారు.



ఒక్కో ఊర్లో అనేక గ్రూపులు

ఇప్పుడు ఎలాంటి సమాచారమైనా వాట్సా‌ప్‌తో క్షణాల్లో ఇట్టే తెలిసిపోతుంది. దీంతో ఒక్కో ఊర్లో అనేక వాట్సాప్ గ్రూపులు ఉన్నాయి. వివిధ పేర్లతో గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ఓ గ్రామంలో సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న ఓ అభ్యర్థి ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశాడు. అందులో దాదాపు 1000 మంది ఉన్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాల్లో ఉంటున్న తమ గ్రామానికి చెందిన ఓటర్ల ఫోన్ నెంబర్లు సేకరించి గ్రూపులో చేర్చాడు. తన ప్యానల్ తరఫున పోటీ చేస్తున్న వార్డు సభ్యుల వివరాలు, వారికి కేటాయించిన గుర్తులు, తనకు వచ్చిన గుర్తును కూడా వాట్సాప్ ద్వారా ఎప్పటికప్పుడు ఓటర్లకు చేరవేస్తున్నాడు. ప్రచారానికి సంబంధించిన వివరాలు కూడా గ్రూపు ద్వారా తెలియజేస్తున్నాడు. ఒక్క క్లిక్‌తో 1000 మందికి సమాచారం అందుతుండటంతో ఇంతకు మించిన ప్రచార అస్త్రం లేదని భావిస్తున్నారు. ఇదే తరహాలో అన్ని పార్టీల నాయకులు సోషల్‌మీడియాను వినియోగించుకుంటున్నారు.

వాట్సాప్ గ్రూపుల్లో చర్చోపచర్చలు

పంచాయతీ ఎన్నికల వేళ వాట్సాప్ గ్రూపులు రాజకీయ చర్చలకు వేదికలుగా మారుతున్నాయి. ఆయా గ్రూపుల్లో అభ్యర్థులకు అనుకూలంగా కొందరు, ప్రతికూలంగా కొందరు కామెంట్లు పెడుతున్నారు. అలాగే పార్టీల మద్దతు ఆశించి భంగపడ్డవారు, వారి అనుచరులు, అవకాశం దక్కినవారు, మద్దతుదారుల నడుమ పోటాపోటీగా సోషల్ వార్ కొనసాగుతోంది.

అభ్యర్థులతో కరచాలనమూ తప్పే

సంగ్రామం

(ఆంధ్రజ్యోతి-చండూరు): ఎన్నికలు జరిగే సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పనిచేస్తున్నట్లు లెక్క. అయితే కొందరు ఉద్యోగులకు తెలియని తనం, అత్యుత్సాహంతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో కరచాలనం చేయడం, సన్నిహితంగా ఉండడం చేస్తుంటారు. ఇదీ చాలా పెద్ద తప్పని ఎన్నికల సంఘం చెబుతోంది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఉద్యోగం ఊడిపోయే ప్రమాదముందని హెచ్చరిస్తోంది.

కరచాలనం ఎందుకు చేయకూడదు.!

ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులు రాష్ట్ర ఎన్నికల సంఘం పరిధిలో విధులు నిర్వహిస్తారు. ఉద్యోగులు ఒక అభ్యర్థికి బహిరంగంగా కరచాలనం చేయడం, సన్నిహితంగా ఉండడం ద్వారా ఆ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నారని లేదా అనుకూలంగా ఉన్నారనే భావన ప్రజల్లో కలుగుతుంది. దీంతో ఎన్నికల ప్రక్రియపై విశ్వసనీయత సన్నగిల్లే అవకాశం ఉంది.

- ఎన్నికల సమయాల్లో కఠిన నిబంధనలు



ప్రవర్తనా నియమావళి

ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ప్రవర్తనా నియమావళి(మోడల్‌కోడ్‌ఆఫ్ కండక్ట్) అమల్లోకి వస్తుంది. ఈ సమయంలో ప్రభుత్వ అధికారులు అభ్యర్థులతో, రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవసరమైన సాన్నిహిత్యాన్ని ప్రదర్శించకూడదు.


పరిధి దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవు

ఎన్నికల విధుల్లోని అధికారులు ఎన్నికల నియామావళిని ఉల్లంఘిస్తే శిక్షలు తప్పవు. నిబంధనల తీవ్రతను బట్టి సర్వీస్ రూల్స్ ప్రకారం శాఖాపరమైన విచారణ ఎదుర్కోవాల్సి వస్తుంది. వేతన పెరుగుదల నిలిపివేయడం, పదోన్నతి నిలపివేయడం, కొన్ని సందర్భాల్లో ఉద్యోగం నుంచి తొలగించడం, నిర్బంధ పదవీవిరమణ చేయించడం జరుగుతుంది. అధికారి ఉద్దేశ్యపూర్వకంగా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో జరిమానాలు విధిస్తారు.

ఎలచ్చన్లు ఏడాదికోసారి వస్తే ఎంత బాగుండో

గ్రామాల్లో పల్లె పోరు తారస్థాయికి చేరింది. మొదటి విడతలో పోలింగ్‌కు ఒక రోజు మాత్రమే మిగిలి ఉండటంతో అభ్యర్థులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. రెండో విడతలో ప్రచారం సాగుతుండగా, మూడో విడతలో సోమవారం గుర్తుల కేటాయింపు పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో పలుగ్రామాల్లో రచ్చబండల వద్ద ఆసక్తికరమైన చర్చలు సాగుతున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-మోత్కూరు)



యాదయ్య: రామన్నా సర్పంచ్ అభ్యర్థులు జోరుగ ఖర్చు పెడుతుండ్రు. ఇవన్నీ పూడేలా ఆమ్దాని వస్తాదే...

రామయ్య: ఏమొస్తదో ఏమో... మొన్నటి ఎలచ్చన్ల గెలిచిన సర్పంచును అడిగితే ఆమ్‌దానా, పాడా, అప్పుల పాలయ్యానన్నాడు. ఇదే ఆఖరు. బుద్ధుంటే మళ్లీ పోటీ చేయొద్దన్నాడు.

యాదయ్య: పాతోల్లేమో అలా అంటుంటే, కొత్తోళ్లేమో ఇంతగా ఉరుకులాడు తున్నరేందే...

రామయ్య: ఏమో వాళ్ల ధైర్యమేందో... సర్పంచ్ సాబ్ అనుపించుకోవాలనేమో...

సాంబయ్య: మా ఊరిలో అయితే సర్పంచ్‌కు పోటీ చేసేటోళ్లు రోజూ వంద మందిని పిలిచి రోజుకు రూ.300 కూలి ఇచ్చి ఊళ్లో ప్రచారానికి తిప్పుతున్నరు. కార్యకర్తలకు ఉదయం చాయ్, టిఫిన్, మధ్యాహ్నం మటన్‌తోనో, చికెన్‌తోనో భోజనం, రాత్రి మందు, మళ్లీ భోజనం పెడుతుండ్రు అన్నడు ఆ వూరికి చుట్టం చూపుగా వచ్చిన సాంబయ్య అక్కడికి వచ్చి.

రామయ్య: అయ్యో మా ఊరోళ్లేం తక్కువ తిన్నరా... ఇక్కడ కూడా అదంతా చేస్తుండ్రు. ఒట్టప్పుడు మనం దండం పెట్టినా నవ్వుడు చేయకుండ పోయేటోడు ఇప్పుడు వంగొంగి దండం పెడుతుండు. ఊర్లజర పెద్దమనిసని ఏదైనా సమస్య చెప్పితే పట్టించుకోనోడు ఇప్పుడు పోటీ చేయగానే అన్నీ చేస్తా, నాదే బాధ్యత అంటుండు.

యాదయ్య: గీ ఎలచ్చన్లు ఐదేళ్ల కోసారి కాకుండా దసరా, సంక్రాంతి పండుగలు వచ్చినట్టు యేడాదికోసారి వస్తే ఎంతో బాగుండునో...కదా...

రామయ్య: ఎలచ్చన్లు యేడాదికోసారి వస్తే పోటీచేసేటోడి కొంపలు ఆరిపోతయ్..అంటూ సెలవిచ్చారు.

జిల్లాలో ఎక్కువ స్థానాలు కైవసం చేసుకుంటాం



మాట్లాడుతున్న కొండేటి మల్లయ్య

మాడ్గులపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ మద్దతుదారులు కైవసం చేసుకుంటారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని ధర్మాపురం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటన నడిపిస్తున్నారన్నారు. పేదల కడుపు నింపేందుకే నాణ్యమైన సన్నబియ్యాన్ని అందించి ఆకలి తీర్చారని అన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో పాటు మహిళలను కోటీశ్వరులను చేసేందుకు రుణాలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందిస్తోందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సమావేశంలో నాయకులు చింతరెడ్డి సైదిరెడ్డి, కొత్త దశరథ పాల్గొన్నారు.

సామాజిక సమీకరణలే కీలకం



(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు సామాజిక వర్గాల వారీగా మద్దతు కూడగడుతున్నారు. పోలింగ్ బూత్ స్థాయిలోనే ఓటర్లను సామాజికవర్గాల వారిగా గుర్తించి ప్రధానఅనుచరులతో వారి కులపెద్దలను రహస్యంగా సంప్రదిస్తున్నారు. సమయం చిక్కినప్పుడు అభ్యర్థులు ఫోన్లలో ఆప్యాయంగా పలుకరిస్తూ గెలుపు కోసం సహకరించాలని కోరుతున్నారు. గెలిచిన అనంతరం మీ సమస్యలు పరిష్కరిస్తామంటూ హామీలు ఇస్తున్నారు. ఇదిలా ఉండా ఎన్నికల సమయంలోనే సమస్యల పరిష్కారానికి పునాది రాయి పడాలనే ముందుచూపుతో అన్ని సామాజిక వర్గాలు వ్యవహరిస్తున్నాయి. దీంతో పంచాయతీ ఎన్నికల్లో కులం ఓట్లు కీలకంగా మారుతున్నారు.

వార్డుల వారీగా ఎక్కువ ప్రాబల్యం కలిగిన కులం ఓట్లను పరిగణనలోకి తీసుకుంటున్న అభ్యర్థులు ఆ సామాజిక వర్గాలను ఆకట్టుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. ఆయా కుల సంఘాల్లో జిల్లా స్థాయి పదవులు ఉన్నవారిని మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నులయ్యారు.

ఇరువైపులా వారే!

అభ్యర్థులకు ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో, ఎవరిని దూరంగా ఉంచాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. పగలు ఓ అభ్యర్థికి మద్దతుగా కనిపిస్తున్న వ్యక్తులు చీకటికాగానే మరో అభ్యర్థికి మద్దతుగా వాడల్లో కలియతిరుగుతున్నారు. తమకే ఓట్లు వేయిస్తామని వారు నమ్మబలుకుతున్నారు. మందు, విందు పార్టీల్లో మునిగి తేలుతున్నారు. వీరిని బుజ్జగించడానికి ఆశావహులు తంటాలు పడుతున్నారు. ఎవరి ప్రచారం వారు సాగిస్తున్నా.. తీరా వీరు చేయిస్తే ఎలా అని అభ్యర్థులు తలలు బాదుకుంటున్నారు. ఏదేమైనా గెలుపునకు ఓట్లు కీలకం కావడంతో ప్రసన్నం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్



మాక్‌పోలింగ్‌కు బారులు తీరిన విద్యార్థులు

చండూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చండూరు మునిసిపాలిటీ కేంద్రంలోని గీతా విద్యాలయంలో విద్యార్థులు మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులే పోటీదారులుగా, ఓటర్లుగా, ఎన్నికల సిబ్బందిగా, పోలీసులుగా వ్యవహరించారు. ఎన్నికల విధానంపై విద్యార్థులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పోలోజు నర్సింహాచారి తెలిపారు. ఓటు ప్రాధాన్యం, అభ్యర్థిని ఎన్నుకునే విధానం, ఎన్నికల నియమావళి అంశాలపై వివరించినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి స్వచ్ఛ హరిత పోటీలకు ఎంపిక

- యాదాద్రిభువనగిరి జిల్లా నుంచి ఎనిమిది పాఠశాలలు



రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన భువనగిరి మండలంలోని వీరారెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్

భువనగిరి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ హరిత విద్యాలయ రాష్ట్రస్థాయి పోటీలకు యాదాద్రిభువనగిరి జిల్లా నుంచి ఎనిమిది పాఠశాలలు ఎంపికయ్యాయి. పాఠశాలలో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా జాతీయ స్థాయిలో స్వచ్ఛ హరిత విద్యాలయ పోటీలు నిర్వహిస్తోంది. ఈ మేరకు ప్రస్తుత విద్యాసంవత్సరానికి యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి ఎనిమిది పాఠశాలలు పోటీలకు అర్హత సాధించాయి. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచే పాఠశాలలకు ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా రూ.లక్ష నజరానా, అవార్డును కేంద్ర ప్రభుత్వం అందించనుందని డీఈవో కే సత్యనారాయణ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు జిల్లా పాఠశాలలు అర్హత సాధిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎంపిక ఇలా..

పలు కేటగిరీలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలకు 819 పాఠశాలలు పోటీపడ్డాయి. కానీ 379 పాఠశాలలు నాలుగు, ఐదు రేటింగ్స్ సాధించాయి. దీంతో 50 మంది స్కూల్ కాంప్లెక్స్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు 379 పాఠశాలలను తనిఖీ చేసి ఎస్‌హెచ్‌వీఆర్ పోర్టల్‌తో సరిచూసి కలెక్టర్ హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ కేటగిరీల్లో ప్రథమ, ద్వితీయస్థానంలో నిలిచిన 8 పాఠశాలలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పాఠశాలలు

రూరల్ -1 (1-8 తరగతులు) కేటగిరిలలో

బీబీనగర్ మండలం మక్తఅనంతారం ప్రాథమికోన్నత పాఠశాల, భువనగిరి మండలం నందనం ప్రాథమికోన్నత పాఠశాల, నారాయణపురం మండలం వాయిల్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల.

రూరల్-2 (9-12 తరగతులు) కేటగిరీలో..

సంస్థాన్‌నారాయణపురం మండలం జనగాం జడ్పీహెచ్ ఎస్, తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్, బొమ్మలరామారం మండలం చీకటిమామిడి జడ్పీహెచ్ఎస్

అర్బన్ -1 కేటగిరిలలో

చౌటుప్పల్ మండలం బంగారిగడ్డ ప్రాథమికోన్నత పాఠశాల.

అర్బన్ -2 కేటగిరీలో..

ఆలేరు మండలం బాలికల ఆశ్రమ పాఠశాల.

రోడ్డు ప్రమాదంలో వార్డు అభ్యర్థి మృతి



సిద్ధయ్య మృతదేహం

గరిడేపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో వార్డు స్థానానికి పోటీ చేస్తున్న అభ్యర్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పొనుగోడ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన జలగం సిద్ధయ్య(45) మంగళవారం సొంతపనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై మండలంలోని గడ్డిపల్లికి వెళ్లి పని ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో రాత్రి ఎనిమిది గంటల సమయంలో పొనుగోడు గ్రామశివారులోకి రాగానే సూర్యాపేట-గరిడేపల్లి ప్రధానరహదారిపై ముందుగా కల్టివేటర్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో బలమైన గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. సిద్ధయ్య అప్పన్నపేట గ్రామపంచాయతీ ఎన్నికల్లో 7వ వార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్నాడు. ఊహించని విధంగా రోడ్డు ప్రమాదంలో సిద్ధయ్య మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. సిద్ధయ్యకు భార్య, కుమారుడు ఉన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

భువనగిరి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కుక్కల దాడిలో లేగ దూడ మృతి చెందింది. ఈ సంఘటన సోమవారం రాత్రి యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని బొల్లేపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు పన్నీరు శశికుమార్ రోజు వారి మాదిరిగా దూడను కొట్టంలో కట్టేశారు. కుక్కలు దాడి చేసి దూడెను హతమార్చాయి.

కట్ల పాము కలకలం

నార్కట్‌పల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారసభలో కట్లపాము కలకలం సృష్టించింది. సభ ముగిసిన అనంతరం కార్యకర్తలు వెళ్తుండగా జనంలోకి పాము దూసుకురావడంతో చెల్లాచెదురయ్యారు. పాము నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీశారు. పాము కూడా ఓ ఆటోలోకి దూరింది. ఆటో అక్కడినుంచి వెళ్లిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

తల్లిదండ్రులకు చెప్పుకోలేక.. ఉసురు తీసుకుంది

- పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక డిగ్రీ విద్యార్థిని బలవన్మరణం



శృతి(ఫైల్ ఫొటో)

నల్లగొండ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న తనకు వివాహం చేద్దామన్న తల్లిదండ్రులకు అడ్డుచెప్పలేక కుమార్తె బలవన్మరణానికి పాల్పడింది. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ విషాదం నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మర్రిగూడ మండలం కొట్టాల గ్రామానికి చెందిన బొర్ర నర్సయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండగా, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మొదటి కుమార్తెకు వివాహం చేశారు. రెండో కుమార్తె శృతి(20) నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతూ రవీంద్రనగర్‌లోని బీసీ వసతిగృహంలో ఉంటోంది. కొంతకాలంగా శృతి తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఉన్నత చదువులు చదివిన తర్వాతే పెళ్లి చేసుకుంటానన్న శృతి పలుమార్లు వివాహం విషయాన్ని వాయిదా వేస్తూ వచ్చింది. రెండు రోజుల కిందట తల్లిదండ్రులు శృతిని కొట్టాల గ్రామానికి పిలిచి మరోసారి పెళ్లి ప్రస్తావన తీసుకురావటంతో తన అభిప్రాయం చెప్పలేదు. స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేయాలని తల్లిదండ్రులకు చెప్పిన శృతి సోమవారం నల్లగొండకు చేరుకుంది. మంగళవారం ఉదయం 11గంటల సమయంలో తాన ఉంటున్న వసతిగృహంలోని స్నానాలగదికి వెళ్లి ఎంతకూ రాకపోవటంతో విద్యార్థినులు ఆందోళనగా అక్కడికి వెళ్లి చూశారు. స్నానాలగదిలో చున్నీతో శృతి ఉరి వేసుకోవడాన్ని గమనించి హాస్టల్ వార్డెన్ సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, అప్పటికే శృతి మృతిచెందింది. వివాహం ప్రతిపాదన తీసుకువచ్చామన్న మనస్తాపంతో తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని తండ్రి నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్ఐ సైదులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్లమెంట్‌లో ఎంపీ చామల తెలుగులో ప్రసంగం



లోకసభలో మాట్లాడుతున్న ఎంపీ చామల

భువనగిరి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వందే మాతరం జాతీయగీతం రాసి 150 ఏళ్ల అయిన సందర్భంగా లోకసభలో జరుగుతున్న చర్చలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలుగులో మాట్లాడారు. బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతాన్ని భావితరాలకు తెలియజేసే లక్ష్యంతో జరగాల్సిన చర్చ అందుకు భిన్నంగా సాగుతోందని విమర్శించారు. కేవలం కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలను తిట్టడానికే చర్చ పెట్టినట్టుగా ఉందన్నారు. వందేమాతరం గీతాన్ని మొదటగా 1896లో ఇండియా నేషనల్ కాంగ్రెస్ సమావేశంలో పాడారని అప్పటి నుంచి వందేమాతరం గీతాన్ని కాంగ్రెస్ పార్టీ గౌరవిస్తూనే ఉందన్నారు. కానీ 1937లో దేశ లౌకిక పరిస్థితులకు అనుగుణంగా సమష్టి నిర్ణయంతో గీతంలో చేసిన మార్పులకు తొలి ప్రధాని నెహ్రూను బాధ్యుడిని చేయడం బీజేపీ దిగజారుడు విధానమన్నారు.

ఇండిగో విమానాలతో ప్రయాణికుల పాట్లు, దేశ రాజధాని ఢిల్లీలో క్షీణిస్తున్న గాలి నాణ్యత, రూపాయి విలువ పతనం తదితర చర్చించాల్సిన అంశాలెన్నో ఉన్నా కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, బెంగాల్ ఎన్నికల దృష్ట్యా వందేమాతరం గీతం అంశం చర్చకు పెట్టిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 2047 రైజింగ్‌లో భాగంగా త్రి ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారన్నారు. దేశంలో డబుల్ ఇంజన్ సర్కారుకు మాత్రమే నిధులు ఇవ్వడం కాదని, అన్ని రాష్ట్రాలకు నిధులు, ప్రాజెక్టులు ఇవ్వాల్సిన బాధ్యతలను మోదీ ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు.

తాను మరణిస్తూ మరో నలుగురికి పునర్జన్మ


- అవయవ దానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు



ప్రశాంత్(ఫైల్)

మోటకొండూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లికి చెందిన యువకుడు తాను చనిపోతూ మరో నలుగురికి పునర్జన్మనిచ్చాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాటేపల్లి గ్రామానికి చెందిన పల్లపు మల్లేష్, మహేశ్వరి దంపతుల కుమారుడైన ప్రశాంత్ (27) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ప్రశాంత్‌కు ఆరేళ్లక్రితం వివాహంకాగా, ఇద్దరు కుమార్తెలు, రెండు నెలల కుమారుడు ఉన్నారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ నెల 5వ తేదీన పెద్దనాన్న కుమారుడు అక్షయ్‌తో కలిసి యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని దర్శించుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో భువనగిరి మండలం రాయగిరి వద్ద రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొనడంతో ప్రశాంత్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. భువనగిరి ఏరియా ఆసుపత్రిలో చికిత్స అనంతరం ప్రశాంత్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్లు వైద్యులు సోమవారం నిర్ధారించారు. దీంతో జీవన్‌దాన్ ప్రతినిధులు ప్రశాంత్ భార్య శ్రీజ, తల్లిదండ్రులు మల్లేష్, మహేశ్వరికి అవయవ దానంపై కల్పించడంతో వారు అందుకు అంగీకరించారు. ప్రశాంత్ శరీరం నుంచి రెండు కిడ్నీలు, కాలేయం, గుండెను సేకరించారు. ప్రశాంత్ అవయవాలతో మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అంగీకరించిన కుటుంబ సభ్యులను వైద్యులు, గ్రామస్థులు అభినందించారు.

వీధి కుక్కలను తరిమేందుకు..

భువనగిరి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పట్టణంలోని పలు బస్తీలలోని ఇళ్ల ముందు ఎరుపు, నీలి తదితర రంగు సీసాలు వేలాడుతున్నాయి. అక్కడ వీధి కుక్కలను తరిమేందుకు స్థానికులు ఇలా కొత్తగా ఆలోచిస్తున్నారు. పట్టణం, పల్లె తేడాలేకుండా ప్రతీ బస్తీని గ్రామసింహాలు రాజ్యమేలుతున్న పరిస్థితి. పగలు, రాత్రి తేడా లేకుండా గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలతో ఆయా ప్రాంతాల ప్రజలు జంకుతున్నారు. రహదారిపై వీధికుక్కల గుంపు ఉందంటే పలువురు వెళ్లే మార్గాన్ని మార్చుకుంటున్నారు. అంతేగాక ఇంటి ఎదుట గేటు లేదా దర్వాజా తీయగానే వాకిట్లో వీధి కుక్కలు అరుస్తూ కనిపిస్తుండటంతో భయంతో వెంటనే తెరిచిన దర్వాజా, గేటును మూసి వేసుకుంటూ ఇంట్లోకి వెళ్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లలు వీధికుక్కలతో మరింత భయానికి గురవుతున్నారు. బైక్‌పై వెళ్తున్న వారిని కూడా వీధి కుక్కలు వెంటాడుతుండటంతో పలువురు అదుపు తప్పి కింద పడి గాయాలపాలవుతుండటం నిత్యకృత్యమవుతోంది. నిత్యం వీధి కుక్కల దాడిలో చిన్నారులు, మహిళలకు గాయాలు అంటూ వస్తున్న వార్తలు ప్రజలను మరింత భయపెడుతున్నాయి.

నిబంధనల సాకు చూపుతూ..

వీధి కుక్కల సమస్యలను పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా నిబంధనల సాకు చూపుతూ తప్పించుకుంటున్నారు. దీంతో ఎవరికి వారు వీధికుక్కల సమస్యను పరిష్కరించుకునే లక్ష్యంతో పలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇంటి ముందు పరిసరాల్లో ఉన్న మొక్కలకు రంగు కలిపిన నీళ్లసీసాలు కడితే వీధి కుక్కలు భయపడుతూ ఇంటి దరిదాపుల్లోకి రావడంలేదని ఇటీవల విస్తృతంగా ప్రచారమవుతోంది. ఆ వింత ప్రచారానికి సోషల్ మీడియా తోడవుతున్నది. ఈ మేరకు భువనగిరి పట్టణంలోని పలు బస్తీలలోని ఇళ్ల ముందు ఎరుపు, నీలి తదితర రంగు సీసాలు వేలాడదీస్తున్నారు.

ఓటర్లను బెదిరించినా.. ప్రలోభ పెట్టినా..

ఇక అంతే సంగతి!

● రుజువైతే ఏడాది జైలు శిక్షతోపాటు జరిమానా



ఓటు వజ్రాయుధంలాంటిది. ప్రజాస్వామ్యాన్ని నాలుగు పాదాలపై నడిపించడానికి ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికల్లో అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా, బెదిరించకుండా చట్టం రక్షణ కల్పించింది.
(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

ఓటర్లకు డబ్బులు ఇచ్చో, బెదిరించో ఓటు వేయించుకుంటే అభ్యర్థులకు శిక్ష పడేలా చట్టం రూపొందించబడింది. అభ్యర్థి అలా చేశాడని ఎవరైనా ఫిర్యాదు చేసి, రుజువు చేసినప్పుడే శిక్షించబడతారు. చట్టం ఎంత పకడ్బందీగా ఉన్నా ఓటర్లకు డబ్బు, మద్యం పంచడం, ఇతర ప్రలోభాలకు గురి చేయడం, వాటికి లొంగకపోతే బెదిరించడం కూడా చేస్తుంటారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా, బెదించినా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)-2023 ప్రకారం జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారు. తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తేనే కేసు నమోదు చేస్తారు. నేరం రుజువైతే శిక్షలు విధిస్తారు. ఇప్పుడు బెదిరింపులు తగ్గాయిగాని అభ్యర్థులు ఓటర్లకు డబ్బు, మద్యం పంచడం మామూలైంది.

ఓటర్లను ప్రలోభపెట్టడం

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఓటర్లకు డబ్బులు ఇవ్వడం, మద్యం పంచడం, చీరలు, ఇతర బహుమతులు ఇవ్వడం నేరం. ఎన్నికల్లో ఇలాంటివి జరుగుతున్నట్లు ఎన్నికల అధికారుల దృష్టికి వచ్చినా, తగిన ఆధారాలతో ఎవరైనా ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేసి విచారణ చేస్తారు. నేరం రుజువైతే సెక్షన్ 171బీ కింద ఏడాదిపాటు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. డబ్బు పంచిన అభ్యర్థితోపాటు ఓటుకు డబ్బులు తీసుకున్న వారికీ శిక్ష విధించే అవకాశాలు ఉన్నాయి.

బెదిరించడమూ నేరమే..

అభ్యర్థులు తమకు అనుకూలంగా ఓటు వేయాలని ఓటర్లను బెదిరించడం... వివిధ రూపాల్లో ఒత్తిడి తేవడం నేరంగా పరిగణిస్తారు. ఇందుకు సెక్షన్ 171సీ కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతారు. నేరం రుజువైతే ఏడాది జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

ప్రత్యర్థిపై తప్పుడు ప్రచారం చేసినా..

ఎన్నికల బరిలో నిలిచిన కొందరు ప్రత్యర్థులపై దుష్ప్రచారాలు చేస్తుంటారు. ఫలితాలను ప్రభావితం చేసేలా ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వివాహేతర సంబంధాలు ఉన్నాయనో, నేరాలు చేశాడనో, కులం, మతం అంటూ తప్పుడు ప్రచారం చేస్తుంటారు. ఇలా ప్రచారం చేయడం కూడా నేరంగానే పరిగణిస్తారు. ఫిర్యాదు చేసి, నిరూపిస్తే తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తికి జరిమానా విధిస్తారు.

దొంగ ఓట్లు వేయడం

పోలింగ్ జరుగుతున్నప్పుడు చనిపోయిన వారి పేరున, ఒకరికి బదులుగా మరొకరు, ఒకసారి ఓటు వేసి మరోసారి ఓటు వేయాలని ప్రయత్నించడం కూడా నేరమే. ఇలాంటి సంఘటనలకు పాల్పడిన వారికి ఏడాది జైలు శిక్ష విధించే అవకాశముంది.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా..

ఎన్నికల సందర్భంగా ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తారు. ఘర్షణపడటం, పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేకుండా చొరబడటం, పోలింగ్ అధికారుల, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడం, ఇతర నేరాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతారు. నేరాన్ని బట్టి శిక్ష ఉంటుంది.

ఎంజీయూ ఫారెన్ రిలేషన్ డైరెక్టర్‌గా శ్వేత

నల్లగొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫారెన్ రిలేషన్ ఆఫీసర్స్ సంచాలకులుగా అసోసియేట్ ప్రొఫెసర్ సూరం శ్వేతను నియమిస్తూ మంగళవారం రిజిస్ట్రార్ అల్వాల రవి ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాదిపాటు డైరెక్టర్‌గా దేశ, విదేశాల్లో విశ్వవిద్యాలయాలు, పరిశోధక సంస్థలను ఎంజీయూతో అనుసంధానం చేస్తూ కొత్త అవకాశాల్లో కీలకంగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా వీసీ ఖాజీ అల్తాఫ్ హుస్సేన్ తదితరులు అభినందించారు.

ఖోఖోలో బాలికల జట్టు జిల్లా ప్రథమస్థానం



క్రీడాకారులను అభినందిస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ఖోఖో అండర్-19 పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా బాలికల జట్టు మొదటి స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా ఛాంపియన్‌గా నిలిచిన టీమ్ బృందాన్ని ఆర్డీవో అశోక్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా తరఫున ఆడి మొదటి బహుమతి సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్ -19 కార్యదర్శి కుంభం నర్సిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 5, 6, 7 తేదీల్లో సికింద్రాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన టీం ప్రతిభ కనబర్చి విజయం సాధించిందన్నారు. అదేవిధంగా ఈ టీంకు సంబంధించిన క్రీడాకారుణులు వైశాలి, చందన, వైష్ణవి, కీర్తన, జాతీయస్థాయిలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఆడనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కనగల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తమనయ్య, బీసీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ బైరెడ్డి సంధ్య, టీం కోచ్‌లు అయితగోని విజయ్, పాలోజు నారి, నాగేంద్ర, జాని, మనీష తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు యోగ్యత



భూక్య యోగ్యత

కోదాడ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ చదరంగం పోటీలకు సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని కొమరబండ తేజ విద్యాలయం విద్యార్థిని భూక్య యోగ్యత ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమా సోమిరెడ్డి తెలిపారు. ఈ నెల 8, 9 తేదీల్లో పెద్దపల్లి జిల్లాలో రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో పాల్గొనగా, 6వ తరగతి చదువుతున్న యోగ్యత అండర్-14 బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. యోగ్యత జనవరి 13 నుంచి 17 వరకు జార్ఖండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

భువనగిరి టౌన్: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు భువనగిరి శ్రీవైష్ణవి జూనియర్ కళాశాలకు చెందిన మరికొండ గణేష్ ఎంపికయ్యాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం పాట్నాలో ఈ నెల 13 నుంచి 17 వరకు జరుగనున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలలో అండర్-17 కేటగిరీలో 1500 మీటర్ల పరుగు పందెంలో తెలంగాణ నుంచి పోటీలో పాల్గొంటారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో గణేష్‌ను కళాశాల ప్రిన్సిపల్ మదిర మల్లేశం, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి గోపాల్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌రావు తదితరులు అభినందించి మెమోంటో అందజేశారు.

పాతగుట్టలోనూ వైకుంఠ ఏకాదశి వేడుకలు

● బస్టాండు, అద్దె గదుల్లో పరిశుభ్రత పాటించాలి ● దేవస్థాన ఈవో వెంకట్రావు



దేవస్థాన సిబ్బందికి సూచనలు చేస్తున్న ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పాతగుట్టలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోనూ వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఈవో ఎస్.వెంకట్రావు అధికారులను ఆదేశించారు. ప్రధాన ఆలయం, పాతగుట్టలో మంగళవారం ఈవో పర్యటించి అధికారులకు పలు సూచనలుచేసి మాట్లాడారు. ఈ నెల 30న నిర్వహించబోయే వైకుంఠఏకాదశి వేడుకలు అత్యంత శోభాయమానంగా నిర్వహిస్తామన్నారు. పాతగుట్ట ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే మెట్ల వెంట షెడ్డు పనులను పరిశీలించి నాణ్యతతో చేపట్టాలన్నారు. చలికాలం అయినందున గదుల్లో గీజర్లు తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. మరమ్మతులు, సమస్యల పరిష్కారానికి, ఫిర్యాదుల స్వీకరణకు రిజిస్టర్ అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట ఏఈవోలు జూశెట్టి క్రిష్ణ, ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వేల్లి రఘు, జాటోత్ శంకర్‌నాయక్, సివిల్ విభాగం ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ ఆంజనేయులు, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావు తదితరులు ఉన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్యకల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయ స్వామికి ఆలయంలో అర్చకులు వేదమంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణం నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం

మఠంపల్లి,డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి లక్ష్మీనృసింహుని ఆలయంలో స్వామికి మంగళవారం విశేష అర్చనలు నిర్వహించారు. ఆలయంలో ప్రాతఃకాలార్చనలు పూర్తయ్యాక అర్చకులు మూలవర్యులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పుష్పాలంకరణ అనంతరం స్తంభోద్భవుడికి ఆరె పత్రితో అష్టోత్తర నామార్చనలు, యాగశాలలో నారసింహ సుదర్శన హోమలు చేపట్టారు. ఉపాలయాల్లో పరివార దేవతలకు ప్రాబోధి నివేదనలు సమర్పించాక క్షేత్రపాలకుడు అంజనేయ స్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన చేశారు. ఉదయం 9:30గంటలకు లక్ష్మీనృసింహుడి పరిణయ వేడుక ప్రారంభమైంది. శ్రీదేవి, భూదేవి సమేత మట్టపల్లి లక్ష్మీనరసింహులను కల్యాణవేదికపై అధిష్ఠింపజేసి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఇంచార్జి ఈఓ అజ్మీర జ్యోతి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

మునగాల రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే మండల ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ వివరాలను ఆయన తెలిపారు.. మండల వ్యాప్తంగా 22 గ్రామపంచాయతీలకు సంబంధించి ఈ నెల 8న ఇద్దరు, మంగళవారం 92 మంది కలిపి మొత్తం ఇప్పటివరకు 94మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని ఆయన తెలిపారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్‌లో ఓటుహక్కును వినియోగించుకునే అవకాశం ఉందన్నారు.

బీఆర్ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధి

సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో పలు గ్రామాలు అభివృద్ధి చెందాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో చివ్వెంల మండలం వల్లభాపురం, జగన్‌నాయక్‌తండాకు చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి మాట్లాడారు. గతంలో చేసిన అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ భూక్యా సంజీవ నాయక్, మాజీ కౌన్సిలర్ షేక్ బాషామియా తదితరులు పాల్గొన్నారు.

● సూర్యాపేటరూరల్: మండలంలోని తాళ్లఖమ్మంపహాడ్ గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు.

అభివృద్ధిని చూసే కాంగ్రెస్‌లో చేరికలు

సూర్యాపేట రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసే వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన స్వగ్రామం బాలెంలలో బీఆర్ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి మాట్లాడారు. బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మామిడి తిరుమల్, అనుచరులతో కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రైజింగ్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్‌గా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రామసాని రమేష్‌నాయుడు, మారపెల్లి ప్రభాకర్, యాదవరెడ్డి పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటు

సూర్యాపేటరూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తనపై అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ ఉప్పు శ్రీనివాస్ మండిపడ్డారు. వట్టే జానయ్య చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం మండలంలోని టేకుమట్ల గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టేకుమట్ల గ్రామంలో ఎన్నికల ఏకగ్రీవానికి యత్నిస్తే, కాంగ్రెస్ నాయకులకు రూ.59లక్షలకు అమ్ముడుపోయానని అసత్య ఆరోపణలు చేయడం సిగ్గు చేటని అన్నారు. 2013లో తనకు సర్పంచ్ పోటీ చేసే అవకాశం వస్తే త్యాగం చేసి, గౌడ కులస్థురాలైన కోల సైదమ్మను నిలబెట్టి గెలిపించుకున్న విషయం తెలియదా? అని ప్రశ్నించారు. గ్రామాభివృద్ధి కోసమే బీఆర్ఎస్ మద్దతు అభ్యర్థులకు ఉప సర్పంచ్, ఎంపీటీసీ ఇవ్వాలని కోరామన్నారు. ఈ విషయంలో ప్రమాణం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు

ఇసుక బట్టీ నుంచి పాఠశాలకు..

తిరుమలగిరి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని ఈదులపర్రైతండా శివారులో ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న 11మంది పిల్లలను మండల రిసోర్స్ పర్సన్ చింతకుంట్ల సురేష్ పాఠశాలల్లో చేర్పించారు. ఒడిషా రాష్ట్రానికి చెందిన కొందరు ఇటుక బట్టీల్లో పనిచేయడానికి ఇక్కడికి వచ్చి, పిల్లలను కూడా తమతో పాటు పనిచేయిస్తున్నారు. బడి బయట పిల్లల సర్వేలో భాగంగా సురేష్ వారిని గుర్తించి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఆరుగురు పిల్లలను జడ్పీహెచ్ఎస్‌లో, మరో ఐదుగురిని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దామెర శ్రీనివాస్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

మొదట విడత పోలింగ్‌కు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

మొదటి విడత ఎన్నికలు జరిగే మండల ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి సామాగ్రితో సిబ్బంది. తరలివెళ్లారు. అందుకోసం అవసరమైన వాహనాలను అధికారులు సిద్ధం చేశారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఎన్నికల సామాగ్రితో తరలివెళ్లే సమయంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మండలం	గ్రామాలు	వార్డులు
ఆత్మకూరు(ఎస్)	30	213
అర్వపల్లి	17	135
మద్దిరాల	15	136
నాగారం	14	128
నూతన్‌కల్	17	158
సూర్యాపేట	24	178
తిరుమలగిరి	12	95
తుంగతుర్తి	23	198

మద్యం దుకాణాలు బంద్

ఈ నెల 11న మొదటి విడత పోలింగ్ నిర్వహిస్తున్న ఎనిమిది మండలాల పరిధిలో మద్యం దుకాణాలను మూసివేయించారు. ఈ నెల 12వ తేదీన ఉదయం 10 గంటలకు తిరిగి తెరుచుకోనున్నాయి. మిగిలిన 15 మండలాలతో పాటు ఐదు మునిసిపాలిటీల పరిధిలోని మద్యం దుకాణాల్లో యథావిధిగా మద్యం విక్రయాలు జరుగనున్నాయి.

అన్ని సిద్ధం చేశాం

జిల్లాలో మొదటి విడత ఎన్నికలు నిర్వహిస్తున్న ఎనిమిది మండలాల్లో పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశాం. ఓటర్లు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాం. సిబ్బంది ఏదైనా సమస్య ఎదురైతే ఉన్నతాధికారులకు తెలపాలి. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తాం. అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక జరగనుంది. బందోబస్తు ఏర్పాటు చేశాం.

● తేజస్‌నంద లాల్ పవార్, కలెక్టర్

	మొదటి విడతలో ఓటర్లు			
మండలం	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరు
ఆత్మకూరు(ఎస్)	44,053	21,800	22,252	1
అర్వపల్లి	24,615	12,157	12,458	
మద్దిరాల	25,307	12,569	12,738	
నాగారం	24,775	12,227	12,545	3
నూతనకల్	29,066	14,503	14,563	
సూర్యాపేట	31,620	15,652	15,967	1
తిరుమలగిరి	17,799	8,925	8,874	
తుంగతుర్తి	34,616	17,308	17,308	

పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి: ఎంపీడీవో

తిరుమలగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో లాజర్ తెలిపారు. మంగళవారం తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని పంపిణీ కేంద్రం వద్ద జోనల్, స్టేజ్ 2, రూట్ అధికారులతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల విధుల అధికారులు తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయానికి బుధవారం చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, జోనల్ అధికారులు శాంతయ్య, మహేష్, అశోక్, మాస్టర్ ట్రైనర్లు అశోక్‌రెడ్డి, సైదులుసత్యనారాయణ పాల్గొన్నారు.

సర్పంచ్ పీఠానికి హోరాహోరీ

హుజూర్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : హుజూర్‌నగర్ మండలంలోని 11 గ్రామపంచాయతీలకు సర్పంచ్‌లు 56 మంది నామినేషన్లు వేయగా మంగళవారం 27 మంది అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. కాగా 29మంది పోటీలో నిలిచారు. కాగా అంజలిపురం సర్పంచ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో 11 గ్రామపంచాయతీలకు సంబంధించి 110 వార్డులకు 285 మంది నామినేషన్లు వేయగా 60 మంది నామినేషన్లు ఉపసంహరించుకోగా 225 మందిలో బరిలో నిలిచారు. అంజలిపురంలో ఎనిమిది మంది వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇదిలా ఉండగా మూడవ విడత ఎన్నికలను ఈ నెల 17న నిర్వహించనున్నారు. ముఖ్యంగా వేపలసింగారం, బూరుగడ్డ, అమరవరం,లక్కవరం, సీతారాంపురం, గోపాలపురం, మర్రిగూడెం, శ్రీనివాసపురం, కరక్కాయలగూడెం, లింగగిరి గ్రామాల్లో హోరాహోరీగా ఎన్నికలు జరగనున్నాయి. బూరుగడ్డ, శ్రీనివాసపురం, అమరవరం, వేపలసింగారంలలో ప్రధాన పార్టీలు మద్దతు ఇచ్చిన అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది.

● మఠంపల్లి: మూడొ విడత పంచాయతీ ఎన్నికల సంబంధించి సర్పంచ్, వార్డు సభ్యులు నామినేషన్ల ఉప సంహరణకు మంగళవారం చివరి రోజు కావడంతో మండల వ్యాప్తంగా 29 గ్రామ పంచాయతీలకు మూడు గ్రామ పంచాయతీలు (మట్టపల్లి, కృష్ణతండా, బాడవతండా) ఏకగ్రీవం అయ్యాయి. కాగా మిగిలిన 26 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులు 85మంది, వార్డు సభ్యులకు 487 పోటీలో ఉన్నారు. s పెదవీడు గ్రామ పంచాయతీ బరిలో 18మంది అభ్యర్థులు బరిలో ఉండటం విశేషం. 26 గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, వార్డు సభ్యులకు రెబల్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. దీంతో నామినేషన్ ఉపసంహరించుకోవాలని బతిమిలాడటం, పలు రకాలుగా ప్రలోభ పెట్టడంతో పాటు కాళ్లబేరాలు ఆడుతున్నారు. కొంతమంది మధ్యవర్తుల ద్వారా సంప్రదింపులు జరిపినా ఫలితం లేకుండా పోయింది. అయినా నామినేషన్ వేసిన పలువురు అభ్యర్థులు తమ పట్టు వీడటం లేదు. మండల వ్యాప్తంగా



కరక్కాయలగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం

మూడో విడతలో 29 గ్రామ పంచాయతీలకు సర్పంచ్ స్థానానికి 256మంది, వార్డు సభ్యులకు 775 మంది నామినేషన్ దాఖలు చేయగా, చివరి రోజు పలువురు ఉపసంహరించుకున్నారు. మూడు గ్రామాల్లో సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుర్రంబోడుతండాలో ఏడో వార్డు, అల్లీపురంలో మూడో వార్డుతో పాటు మొత్తం 49వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. 26 పంచాయతీలలో సర్పంచ్ అభ్యర్థులు 85మంది, వార్డు సభ్యులు 487మంది పోటీలో ఉన్నట్లు ఎంపీడీవో జగదీష్ తెలిపారు.

బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వెంకట్

నేరేడుచర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నేరేడుచర్లకు చెందిన పొదిల వెంకట్‌ను నియమించారు. ఈ మేరకు వెంకట్‌కు నియామకపత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ బీసీ ఉద్యమంలో చురుకుగా పని చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

సూర్యాపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీకంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం సూర్యాపేటలోని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దండశ్యాంసుందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని తెల్ల రేషన్‌కార్డుదారులు, జర్నలిస్టులు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏకగ్రీవంగా సర్పంచ్‌లు ఎన్నిక

హుజూర్‌నగర్

గోలి శ్రీనివాస్, అంజలిపురం

చింతలపాలెం

విజయలక్ష్మి, శోభనాద్రిగూడెం

మఠంపల్లి

విజయశాంతి, మట్టపల్లి

మఠంపల్లి

బానోతు రమాదేవి కృష్ణతండా

మఠంపల్లి

భూక్య చిరంజీవి, భూక్యతండా

గరిడేపల్లి

వెంకటరమణ, వెంకట్రాంపురం

హుజూర్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజలిపురం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా గోలి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో దిగిన శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా 8 వార్డులు కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒకటో వార్డుకు యర్రం సీత, రెండో వార్డుకు తక్లూరు జయమ్మ, మూడో వార్డుకు కిష్టపాటి లక్ష్మి, 4వ వార్డుకు అల్లపురి శ్రీనివాస్, 5వ వార్డుకు అన్నెం నర్సింహారెడ్డి, 6వ వార్డు కు ఆవుదొడ్డి గంగ, 7వ వార్డుకు గొట్టం కాశయ్య, 8 వార్డుకు పట్టేటి సునీతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్, 8 వార్డులకు ఒక్కో నామినేషన్ రావడంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధికారులు తెలిపారు.

● చింతలపాలెం: మండలంలో మండలంలోని శోభనాద్రిగూడెం గ్రామ సర్పంచ్‌గా కాంగ్రెస్ బలపర్చిన ఆమెరా విజయలక్ష్మీవెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలోని మొత్తం ఎనిమిది వార్డుల్లో సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శోభనాద్రి గూడెం గ్రామంలో 776మంది ఓటర్లు ఉన్నారు. బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో విజయలక్ష్మి ఎన్నిక ఏకగ్రీవమైంది. అధికారులు ఈ విషయాన్ని ధ్రువీకరించాల్సి ఉంది.

● మఠంపల్లి: మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా మూడు పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. మండలంలోని మట్టపల్లి సర్పంచ్‌గా రామిశెట్టి విజయశాంతిఅప్పారావు, కృష్ణతండాకు బానోతు రమాదేవిశంకర్‌నాయక్, బాడవతండాకు భూక్య చిరంజీవిలు ఏకగ్రీవమైనట్లు ఆయా అధికారులు మంగళవారం తెలిపారు.

● నేరేడుచర్ల: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ముగ్గురు సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పులగంబండ తండా సర్పంచ్‌గా బానోతు మంగ, ఫత్తేపురం సర్పంచ్‌గా ఎదుల సుజితారెడ్డి, బూర్గులతండా సర్పంచ్‌గా మాలోతు నాగునాయక్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పులగంబండతండా సర్పంచ్, రెండో వార్డు ఏకగ్రీవంగా కాగా, మిగితా వార్డులకు పోటీ ఉంది. ఫత్తేపురం, బూర్గగల తండా సర్పంచ్‌లతో పాటు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

● పాలకవీడు: పాలకవీడు మండలంలో మూడు గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హనుమయ్యగూడెం, గుడుగుంట్లపాలెం, మీగడంపాడుతండా గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. మీగడం పాడు తండా సర్పంచ్‌గా చందు నాయక్, హన్మయ్యగూడెం సర్పంచ్‌గా బానోతు మంగమ్మ, గుడుగుంట్లపాలెం సర్పంచ్‌గా మునగాల వరలక్ష్మీరామానుజరెడ్డిలనే ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

● గరిడేపల్లి: మండలంలో మూడోదశలో జరుగుతున్న3 గ్రామాల సర్పంచ్ ఎన్నికలకు 5వ తేదీన 33 గ్రామ పంచాయతీలకు సర్పంచ్ 300, వార్డు సభ్యులకు నామినేషన్‌లను సమర్పించడం జరిగింది. మంగళవారం ఉపసంహరణల అనంతరం 8 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎ న్నికయినట్లు అధికారులు ప్రకటించారు.


మండల వ్యాప్తంగా మొత్తం 300 వార్డులుండగా 59 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్‌లుగా వెంట్రాంపురం కీసరి వెంకటరమణ బుచ్చిబాబు, కోదండ రాంపురం మచ్చ ముత్తమ్మ, కాల్వపల్లి సంద్రపంగు బజారమ్మ, మర్రికుంట కర్తం భద్రయ్య, రాయిని గూడెం గుండు రామాంజిగౌడ్, మంగాపురం బత్తిని అంజయ్య గౌడ్, అబ్బిరెడ్డి గూడెం యడవెళ్లి కమలమ్మ, లక్ష్మీపురం కుసుమ నర్సిరెడ్డి, ఏకగ్రీంగా ఎన్నికయ్యారు.

సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా

(5వ పేజీ తరువాయి)

టీంలు, 23 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీంలు, 23 ఫ్లయింగ్ సర్వేలెన్స్ టీంలు, 18 పోలీస్ స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సైతం ఎప్పటికప్పుడు సమాచార సేక రణ కోసం ప్రత్యేకంగా వ్యవస్థ ఏర్పాటు చేశారు.

మొదటి విడతకు పటిష్ట బందోబస్తు..



మొదటి విడత ఎన్నికలు జరిగే 8 మండలాల పరిధిలో సుమారు 1500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు అదనపు ఎస్పీలు, 8 మంది డీఎస్పీలు, 15 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు కలిపి 1500 వందల మంది బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో పాటు వీడియో రికార్డింగ్ చేయనున్నారు.

● కొత్తపల్లి నరసింహ, ఎస్పీ

అభివృద్ధికి ఆమడదూరంలో పల్లెలు

తుంగతుర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో అభివృద్ధికి ఆమడదూరంలో పల్లెలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక మలుపు తిరిగిన డిసెంబరు 9 విజయ్ దివస్‌ను పురస్కరించుకుని మంగళవారం తుంగతుర్తిలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయన్నారు. గత ఎన్నికల్లో తండాల్లో సర్పంచ్‌లను గిరిజనులు స్వచ్ఛందంగా ఏకగ్రీవం చేసుకున్నారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు ఇతర పార్టీల అభ్యర్థులను బెదిరిస్తూ, భయభ్రాంతులకు గురి చేస్తూ బలవంతంగా ఏకగ్రీవాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు గుజ్జ యుగంధర్‌రావు, ఎస్‌ఏ రజాక్, మాజీ ఎంపీపీ గుండగాని కవితారాములుగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలంయాదవ్, నాయకులు పులుసు యాదగిరి, వివిధ మండలాల అధ్యక్షులు రఘునందన్‌రెడ్డి, కల్లెట్లపల్లి ఉప్పలయ్య, ఉపేందర్, సోమేశ్వర్, బీఆర్ఎస్ బలపర్చిన వివిధ గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడినవారికి సముచిత స్థానం

అనంతగిరి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల విజయానికి కష్టపడి పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు అన్నారు. మంగళవారం అనంతగిరిలో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెండేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేసిందని, భవిష్యత్‌లో మరింత అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరాలన్నారు. రాజకీయ, సామాజిక సమీకరణాలతో టికెట్ దక్కని ఆశావహులు నిరాశ చెందవద్దని, పార్టీ కోసం కష్టపడిన వారికి భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వేనేపల్లి వెంకటేశ్వరరావు, వేనేపల్లి చినవెంకటేశ్వరరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు నకిరేకంటి సత్యానందం, సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీలు, ఈదుల కృష్ణయ్య, కొండ్రు బాబు, దర్శనపు దావీదు, గాదం లింగయ్య, నకిరికంటి పున్నయ్య, చిన్నం బాబు, కొత్తపల్లి బాబు, మాదాసు పిచ్చయ్య, గాద వెంకన్న, మాదాసు వెంకటేశ్వర్లు, గురజాల శాంతయ్య, కొండ్రు కృష్ణయ్య పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతోనే విద్యార్థుల బలిదానాలు

హుజూర్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ ఆలస్యం, నిర్లక్ష్యం తోనే తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ఆత్మ బలిదానాలు చేసుకున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి ఆరోపించారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ పోరాటాలతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కేసీఆర్ దీక్షా దివస్‌తోనే ప్రత్యేక రాష్ట్రం వచ్చిందన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని రేవంత్‌రెడ్డి ఆనాడు వ్యతిరేకించారన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సోనియాగాంధీని విమర్శించిన నాయకులకే ఆ పార్టీలో పదవులు ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు జక్కుల నాగేశ్వరరావు, బెల్లంకొండ అమర్, కేఎల్ఎన్ రెడ్డి, పచ్చిపాల ఉపేందర్‌యాదవ్, అప్పిరెడ్డి, రాజశేఖర్, రెహానా, బాలాజీ పాల్గొన్నారు.

ప్రజల కలలను సాకారం చేసిన సోనియాగాంధీ


కోదాడలో సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కోదాడటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రజల కలలను సాకారం చేసిన ధీర వనిత సోనియాగాంధీ అని టీపీసీసీ ప్రతినిధి చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకలను మంగళవారం కోదాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి మిఠాయి పంపిణీ చేశారు. ప్రధానిగా రెండుసార్లు అవకాశం వచ్చినప్పటికీ త్యాగం చేసిన మహనీయురాలు సోనియాగాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బషీర్, మునావర్, కందుల కోటేశ్వరరావు, చింతలపాటి శ్రీను, పాలూరి సత్యనారాయణ, గంధం యాదగిరి, షఫీ, కట్టెబోయిన శ్రీను, సూర్యనారాయణ, అజీమ్, రమేష్, రవినాయక్, మదర్, దేవమణి, బాజన్, షమీ, గంధం పాండు, సత్యనారాయణ, సైదిబాబు, జనార్దన్, పుల్లయ్య, శైలజ, బాబా దాసు, ముస్తాఫా పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని ఇందిర సెంటరులో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి మిఠాయి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు, సాముల శివారెడ్డి, దొంగరి వెంకటేశ్వర్లు, యండీ అజీజ్‌పాషా, గల్లా వెంకటేశ్వర్లు, మల్లయ్య, సుబ్బరాజు, మన్సూర్‌అలీ, యోహాన్, గోవిందరావు, వెంకటేశ్వర్లుపాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు సోనియా గాంధీ పుట్టినరోజును మంగళవారం ఆత్మకూర్(ఎస్) మండలంలోని పలు గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి పేదలకు పండ్లు, మిఠాయి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రహీం, కుమ్మరికుంట్ల వేణు, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు, గ్రామ కమిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

ఇంటింటికీ ప్రచారంలో గుంటకండ్ల రామచంద్రారెడ్డి

నాగారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగారం సర్పంచ్ అభ్యర్థి మాజీ మంత్రి, కుమారుడు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి మంగళవారం గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రచారంచేశారు. తండ్రికి మద్దతుగా జగదీష్‌రెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. 95ఏళ్ల వయసు ఉన్న రామచంద్రారెడ్డికి ఓటర్ల నుంచి మంచి స్పందన వస్తోంది. రామచంద్రారెడి నిజాం కాలంలో స్వాతంత్య ఉద్యమంలో పాల్గొన్నారు. వీరు నలుగురు అన్నదమ్ములు. పెద్దన్న పిచ్చిరెడ్డి నాగారం సర్పంచ్‌గా ఎన్నికై 25ఏళ్ల పాటు కొనసాగారు. ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి మూడో కుమారుడు. రామచంద్రారెడ్డి సూర్యాపేటలో హెచ్ఎస్‌సీ వరకు చదివారు. 18ఏళ్ల వయస్సులో సావిత్రితో వివాహమైంది. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, గ్రామ పట్వారీగా పనిచేశారు. ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యవసాయంతో పాటు రాజకీయాల్లోకి వచ్చారు. అభ్యర్థి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ జనరల్‌గా కావడంతో గ్రామస్థుల కోరిక మేరకు బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాన్నారు. గెలిపిస్తే ఐదేళ్ల ప్రజలకు సేవలు అందిస్తానని, ఇప్పుడు తనకు 95ఏళ్ల అని సర్పంచ్‌గా సేవలు అందిస్తూ శేషజీవితం 100 ఏళ్లు పూర్తి చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.


నాగారంలో గుంటకండ్ల రామచంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న కుమారుడు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

ధనుర్మాస ఉత్సవాలను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగడ్డ దేవాలయంలో ఈ నెల 16వ తేదీ నుంచి ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో లక్ష్మణ్‌రావు తెలిపారు. మంగళవారం దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. జనవరి 13న భోగి పండుగ సందర్భంగా గోదాదేవి కల్యాణం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హరీష్‌కుమారాచార్యులు, కిరణ్, రమేష్, ఉపేందర్, శ్రీను, భక్తులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అభివృద్ధి కావాలంటే గెలిపించాలి: శ్రీనివాస్‌గౌడ్

నూతనకల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్యాల గ్రామంలో అభివృద్ధి కావాలంటే తనను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి అనంతుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. మంగళవారం మిర్యాల గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనను గెలిపిస్తే గ్రామంలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని, గ్రామంలో శాంతియుత వాతారణం కొనసాగడానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళతానని అన్నారు. గ్రామస్థులు విజ్ఞతతో ఆలోచించి తనను గెలిపించాలని కోరారు. శ్రీనివాస్‌గౌడ్‌కు మద్దతుగా మెంచు జయమ్మ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గ్రామంలో శాంతియుత వాతావారణం కావాలనుకుంటే అనంతుల శ్రీనివాస్‌గౌడ్‌ను గెలిపించాలని ఓటర్లను ఆమె కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, నూతన పెన్షన్లు కావాలంటే కాంగ్రెస్ మద్దతు ప్రకటించి అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్‌ను ఆదరించాలన్నారు.


మిర్యాల గ్రామంలో ప్రచారం చేస్తున్న అభ్యర్థి అనంతుల శ్రీనివాస్‌గౌడ్